RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | జులై 10 సోమవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 187 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | MONDAY AUGUST 10 2026 | VOL:16 | ISSUE: 187 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA


# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి కేసీఆర్

## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆదివారం చేరుకున్న కేసీఆర్..ముందుగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ సమయంలో భావోద్వేగానికి గురైన కేసీఆర్ కంటతడి పెట్టుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ది కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున మొత్తం రూ. 2 కోట్లు అందించాలని.. (మిగతా 2వ పేజీలో..)



## ఆగస్ట్ 15న తెలంగాణలో ప్రారంభించబోయే కొత్త పథకాలు ఇవే!




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఈసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు వేదికగా మార్చనుంది. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు. కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు, 5 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 3-4 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించే అవకాశాలున్నాయి. గిగ్ వర్కర్లకు చట్టపరమైన రక్షణ, సనత్‌నగర్‌లో ౧×మీా ప్రారంభం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై కీలక ప్రకటనలు వెలువడనున్నాయి. సెప్టెంబర్‌లో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపన జరగనుంది.

## వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

- వ్యవస్థతో ద్వేషంతో కాదు, ప్రేమతో పోరాడాలన్న రాహుల్ గాంధీ
- దేశంలో తీవ్ర ఉద్యోగ సంక్షోభం ఉందని ఆందోళన
- సంస్థలన్నింటినీ ఒకే పార్టీ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపణ
- రాహుల్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లిన విద్యార్థులు
- దేశంలో 'మొహబ్బత్ కీ దుకాణ్' తెరవాలని యువతకు పిలుపు




## నా రాజీనామాకు కారణమదే: తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

- రాజీనామాపై మౌనం వీడిన ధర్మేంద్ర ప్రధాన్
- జెన్-జీ విద్యార్థులను కొందరు తప్పుదోవ పట్టించారని ఆరోపణ
- ప్రధాన్ పై విమర్శలకు పోలీసుల లాఠీఛార్జే కారణమన్న బీజేడీ
- ముందస్తు చర్యగా 30 మంది బీజేడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నీట్ పేపర్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా



చేసిన బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా ఆ అంశంపై స్పందించారు. విద్యార్థులను (జెన్-జీ) (మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే
- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా (మిగతా 2వ పేజీలో..)



## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు.. బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!

- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు

కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు

(మిగతా 2వ పేజీలో..)



## ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు: ఐఐటీ గోల్డ్ మెడలిస్టులు

- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ
- ప్రధాని ప్రసంగం తమను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పిన గోల్డ్ మెడలిస్టులు




## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం

- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు

నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వారితో మమేకమయ్యారు. డప్పు వాయిస్తూ, ధింసా నృత్యకారులతో కలిసి అడుగులు



వేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఆదివారం విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన (మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటికి కేసీఆర్

మొదటి పేజీ తరువాయి)

ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షలను ఆమె పేరిట బ్యాంకులో జమ చేయాలని ఇప్పటికే కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పెద్ది కుటుంబసభ్యులకు వాటికి సంబంధించిన పత్రాలను అందజేశారు. పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పెద్ది పిల్లల భవిష్యత్తు, చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ అనంతరం జిల్లా పార్టీ ముఖ్యులు సమావేశమై ఆయన కుటుంబానికి అందించాల్సిన ఇతర సంక్షేమ కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకుంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కాగా, కేసీఆర్ నల్లబెల్లికి వస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు దారిపొడవునా ఆయనకు సంఘీభావం తెలిపాయి. పలుచోట్ల కేసీఆర్ తన కాన్వాయ్‌ను ఆపి కార్యకర్తలను పలకరించి ధైర్యం చెప్పారు.

## నా రాజీనామాకు కారణమదే: తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

మొదటి పేజీ తరువాయి)

తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, అందుకే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. జులై 25న రాజీనామా చేసిన సరిగ్గా రెండు వారాల తర్వాత, భువనేశ్వర్‌లోని జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "జెన్-జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి నా రాజీనామాను ప్రతిపాదించాను" అని ప్రధాన్ వివరించారు. భారతదేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల మంది పిల్లలు పుడుతున్నారని, గడిచిన పదేళ్లలో 20 కోట్ల మంది జన్మించారని, వారి ఆకాంక్షలే దేశాన్ని 'విశ్వగురువు'గా నిలబెడతాయని ఆయన అన్నారు. మరోవైపు తన ఒడిశా పర్యటన సందర్భంగా బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలపై కూడా ప్రధాన్ తీవ్రంగా స్పందించారు. ఎయిర్‌పోర్ట్ వద్ద 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' అంటూ బీజేడీ యువజన, విద్యార్థి విభాగం కార్యకర్తలు చేసిన నిరసనలను ప్రస్తావిస్తూ మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. "నేనొక రైతు కొడుకుని. మీరు నన్ను వెనక్కి పొమ్మన్నా, మళ్లీ వస్తాను. నవీన్ బాబు నన్ను ఒడిశా ప్రజలకు అవమానకరమని, చెడ్డవాడినని అంటున్నారు. ఒడిశా ప్రజలు సిగ్గుతో తలదించుకునే పని నేనెప్పుడైనా చేశానా?" అని సభను ప్రశ్నించగా, 'లేదు' అంటూ పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే పని తాను ఎప్పటికీ చేయనని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేసిన వేదికపై బీజేడీ ఎమ్మెల్యే ప్రసన్న ఆచార్య కూడా ఉన్నారు. బీజేడీ నిరసనల నేపథ్యంలో తాను రావాలా? వద్దా? అని ప్రసన్న ఆచార్యను సంప్రదించానని, ఆయన రమ్మని చెప్పడంతోనే వచ్చానని ప్రధాన్ పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ విమర్శలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి బదులిచ్చారు. "ప్రధాన్‌ను ఎవరూ అప్రతిష్ఠపాలు చేయలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ద్వారా ఆయన పార్టీ, ప్రభుత్వమే ఆయన పరువు తీశాయి. పోలీసుల దౌర్జన్యాలకు నవీన్ పట్నాయక్‌ను నిందించడం ఎంతవరకు సమంజసం?" అని పూజారి ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. ప్రధాన్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా సుమారు 30 మంది బీజేడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## వ్యవస్థతో ప్రేమతో పోరాడండి.. విద్యార్థులకు రాహుల్ గాంధీ పిలుపు

దేశంలోని వ్యవస్థలో మార్పు కోసం ద్వేషంతో కాకుండా ప్రేమతో పోరాడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యువతకు పిలుపునిచ్చారు. దేశంలో ఉద్యోగ అవకాశాలు కనుమరుగయ్యాయని, కీలక రాజ్యాంగబద్ధ సంస్థలను ఒకే పార్టీ తన గుప్పిట్లో పెట్టుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరిగిన 'ఛాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఏ విద్యార్థి హృదయంలోనూ ద్వేషం ఉండకూడదు, కేవలం ప్రేమ మాత్రమే నిండి ఉండాలి. మనం ప్రేమ, ఆప్యాయతలతోనే వ్యవస్థను ప్రక్షాళన చేయాలి" అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 'మొహబ్బత్ కీ దుకాణ్' (ప్రేమ దుకాణం) తెరవాలని యువతకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి, వ్యయ ప్రయాసలకోర్చి చదువుకున్నా ఉద్యోగ అవకాశాలు లభించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి నిర్ణయాల ఫలితంగా 'మేడ్ ఇన్ ఇండియా' అన్నది ఎక్కడా కనిపించడం లేదని, మార్కెట్లో కేవలం చైనా, వియత్నాం ఉత్పత్తులే రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. ఒకప్పుడు రూ. 150 కోట్ల నిధులు కలిగిన ఒక రాజకీయ పార్టీకి ఇప్పుడు రూ. 10,000 కోట్లకు పైగా నిధులు చేరాయని, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారిని వైస్-ఛాన్సలర్లుగా నియమిస్తూ విశ్వవిద్యాలయాలను, ఇతర కీలక సంస్థలను తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. అలహాబాద్ యూనివర్సిటీ లైబ్రరీ వర్షపు నీటిలో మునిగిపోతోందని, దీనిపై నిరసన వ్యక్తం చేస్తే దాడులు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఓ న్యాయశాస్త్ర విద్యార్థి ఆయనకు వివరించారు. యూపీపీఎస్సీ పరీక్షల్లో 'నార్మలైజేషన్' ప్రక్రియపై కొందరు, 2018 నుంచి ఉపాధ్యాయ నియామకాలు పూర్తి కాకపోవడంపై మరికొందరు తమ గోడును వెళ్లబోసుకున్నారు. విద్యార్థులు వివరించిన సమస్యలను ఓపికగా విన్న రాహుల్ గాంధీ, నిర్మాణాత్మక పోరాటం ద్వారానే లక్ష్యాలను సాధించవచ్చని వారికి సూచించారు.

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా థింసా స్టెప్పులేసిన సీఎం

మొదటి పేజీ తరువాయి)

గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ థింసా నృత్యం, డప్పు వాయిద్యాల నడుమ సీఎం వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా డప్పు చేతబట్టి వాయించి సభలో కొత్త ఉత్తేజం నింపారు. అంతకుముందు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రతి పౌరుడూ దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం కోసం ఓ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను కాపాడుతున్న గిరిజనులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని కొనియాడారు. సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి స్థాయికి ఎదగడమే దీనికి నిదర్శనమని గుర్తుచేశారు. "మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ వంటి ఎందరో సామాన్యులే సంకల్ప బలంతో అసాధారణ విజయాలు సాధించారు" అని చంద్రబాబు అన్నారు. "నేను, నా దేశం, నా రాష్ట్రం అనే భావనతో ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలనేది నా సంకల్పం" అని స్పష్టం చేశారు. ఒక రైతు పంట పండించినా, ఒక విద్యార్థి బాగా చదివినా, ఉద్యోగి నిబద్ధతతో పనిచేసినా అదంతా దేశ నిర్మాణంలో భాగమేనని ఆయన వివరించారు. "వ్యక్తిగతంగా విజయం సాధించడం కూడా దేశ నిర్మాణంలో భాగమే. పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఆస్తి. అందరి గెలుపే దేశం గెలుపు" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' దార్శనికతకు అనుగుణంగా, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విజన్‌తో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు. వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు. అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

## ప్రధానిలా కాదు, మా సీనియర్‌లా మాట్లాడారు: ఐఐటీ గోల్డ్ మెడలిస్టులు

శనివారం జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై గోల్డ్ మెడల్ విజేతలు ప్రశంసలు కురిపించారు. ఆయన తమతో ఒక దేశ ప్రధానిలా కాకుండా, తమ క్యాంపస్‌కు చెందిన ఒక సీనియర్‌లా మాట్లాడటం తమను ఎంతగానో ఆకట్టుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలను మాత్రమే కాకుండా, దేశ సేవ చేయాలనే లక్ష్యాన్ని కూడా తమతో పాటు తీసుకెళ్తున్నారని ఆయన ఆకాంక్షించారు. ఈ స్నాతకోత్సవంలో 587 మంది పీహెచ్‌డీ స్కాలర్‌లతో సహా మొత్తం 3,000 మందికి పైగా విద్యార్థులు తమ పట్టాలను అందుకున్నారు. 'పర్ఫెక్ట్ టెన్' గోల్డ్ మెడల్ గ్రహీత అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "ఆయన ప్రసంగించిన తీరు మాతో పూర్తిగా కనెక్ట్ అయ్యింది. మేం మా ప్రధాని ప్రసంగాన్ని వింటున్నట్లు కాకుండా, ఒక సీనియర్ మాతో మాట్లాడుతున్నట్లుగా అనిపించింది" అని పేర్కొన్నారు. మరో గోల్డ్ మెడలిస్ట్ అక్షత్ సింఘాల్ మాట్లాడుతూ.. క్యాంపస్‌లోని 'నైట్ మెస్', జియా సరాయ్‌లో పోహా తినడం వంటి చిన్న అంశాల గురించి కూడా ప్రధానికి తెలియడం తమకు ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రామిరెడ్డి వెంకట సాయి రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "హాస్టల్‌లో తెల్లవారుజామున 3 గంటలకు జరిగే విషయాలను సైతం ప్రధాని ప్రస్తావించారు. ఇంతటి ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి మా క్యాంపస్ జీవితంలోని చిన్నచిన్న క్షణాలను గుర్తుంచుకోవడం మాకు ఎంతో సంతోషాన్నిచ్చింది" అని వివరించారు.

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు.. బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి సోకినప్పుడు అమ్మవారిని శాంతింపజేయడానికి ఈ పండుగ మొదలైందని చాలామంది భావిస్తారు. కానీ, అంతకు కొన్ని వేల సంవత్సరాల ముందు నుంచే తెలంగాణ గడ్డపై ఈ సంప్రదాయం ఉందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ప్రకారం, సుమారు 3 వేల ఏళ్ల కిందటే ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే ఆచారం ఉంది. దీనికి నిదర్శనంగా కామారెడ్డి జిల్లా మరంద్రాళ్ల తండా సమీపంలోని రాతి గుట్టల్లో స్త్రీలు నెత్తిన బోనం ఎత్తుకున్న శిల్పాలు కనుగొన్నారు. అంతేకాకుండా, సుమారు 1600 ఏళ్ల కిందటి విష్ణుకుండినుల కాలం నాటి 'గర్భాపాత్ర' కూడా మేడ్చల్ జిల్లా కీసరగుట్ట వద్ద లభించింది. కాకతీయుల పాలనలోనూ బోనాలు వైభవంగా జరిగాయి. కాకతీయ రాణి రుద్రమదేవి తన కుమార్తె ముమ్మడమ్మకు సంతానం కలగాలని మొగిలిచర్లలోని ఏకవీరాదేవికి బోనం సమర్పించినట్లు ఏకామ్రనాథుడి 'ప్రతాప చరిత్ర' గ్రంథంలో ఉంది. పండితారాధ్య చరిత్రలో కూడా ఈ ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. బోనాల పండుగ గురించి అధికారికంగా ప్రస్తావించిన మొట్టమొదటి శిలాశాసనం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. క్రీ.శ. 1516 మే 4న వేయించిన ఈ శాసనం ప్రస్తుతం హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని గొబ్బూరులో లభించిన ఈ శాసనంలో, బోనాల పండుగ నిర్వహణ కోసం రాజ్యం నుంచి చెల్లించాల్సిన పన్నులను రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనూ బోనాల సంప్రదాయం కొనసాగింది. శాలిబండ గ్రామంలో బోనాలు జరుపుకుంటున్న దృశ్యాలున్న ఒక సూక్ష్మ చిత్రపటం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో గత 400 ఏళ్లుగా ఆషాఢ బోనాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఈ ఆధారాలన్నీ పరిశీలిస్తే, 1816లో ప్లేగు వ్యాధి నిర్మూలన కోసం ప్రారంభమైందన్న వాదన కంటే ఎంతో ముందే బోనాల పండుగ తెలంగాణ జనజీవనంలో, సంస్కృతిలో భాగమైందని స్పష్టమవుతోంది.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
ఆగస్టు | సోమవారం | 10 | 2026



# ఖమ్మం జిల్లాలో ఆహార భద్రత గాలికేనా?

- **హోటళ్లు.. కిరాణా దుకాణాల్లో నిబంధనలకు తూట్లు**
- **అధికారుల తనిఖీలు ఎక్కడ? చర్యలు ఎందుకు కనిపించడం లేదు?**
- **ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులపై కొరడా ఝుళిపించాల్సిందే**

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 09 (దేశ టైమ్స్)**

ఖమ్మం జిల్లాలో ఆహార భద్రత నిబంధనలు అమలవుతున్నాయా? లేక కాగితాలకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పట్టణం నుంచి మండల కేంద్రాల వరకు పలు హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఆహార పదార్థాల విక్రయం, నిల్వ, పరిశుభ్రత విషయంలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత అధికారులు ఎంతమేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**కల్తీ.. నాణ్యత లేని సరుకులు.. గడువు దాటిన వస్తువులు?**

కొన్ని హోటళ్లలో నాణ్యత లేని ముడి పదార్థాల వినియోగం, అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు, ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా కొన్ని కిరాణా దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, సరైన లేబులింగ్ లేని వస్తువులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు నిజమైతే అవి చిన్న విషయాలు కావు. ప్రజల ఆరోగ్యానికి నేరుగా ముప్పు కలిగించే అంశాలు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతమేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారనే దానిపై స్పష్టత అవసరం.

**అధికారులు ఉన్నారా? లేరా?**

హోటళ్లు, కిరాణా దుకాణాలు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర ఆహార వ్యాపార సంస్థలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత ఆహార భద్రత అధికారులపై ఉంది. అయితే జిల్లాలో తరచూ వినిపిస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారుల పర్యవేక్షణ ఎక్కడుంది? తనిఖీల వివరాలు ప్రజలకు ఎందుకు కనిపించడం లేదు? నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని సంస్థలపై జరిమానాలు విధించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**తనిఖీలు కేవలం పండుగల సమయంలోనేనా?**

ప్రముఖ పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే హడావుడిగా తనిఖీలు నిర్వహించి ఫొటోలు విడుదల చేయడం కాకుండా ఏడాది పొడవునా నిరంతర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా హోటళ్లలో ఉపయోగిస్తున్న నూనె నాణ్యత, మాంసం నిల్వ విధానం, తాగునీటి నాణ్యత, వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, గడువు తేదీలు, ఫుడ్ లైసెన్సులు వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఊరుకునేది లేదు ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై రాజకీయ, ఆర్థిక లేదా ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కల్తీ లేదా నాణ్యత లేని ఆహారం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపితే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నకు సంబంధిత శాఖ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**జిల్లా యంత్రాంగం స్పందించాలి**

ఖమ్మం జిల్లాలోని హోటళ్లు, కిరాణా దుకాణాలు, బేకరీలు, స్వీట్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థల వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఇప్పటివరకు అధికారులు నిర్వహించిన తనిఖీలు, నమోదు చేసిన కేసులు, విధించిన జరిమానాలు, సీజ్ చేసిన ఆహార పదార్థాల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆహార భద్రత కేవలం శాఖకు సంబంధించిన అంశం కాదు.. ప్రతి పౌరుడి ఆరోగ్యానికి సంబంధించిన విషయం. అధికారులు ఇకనైనా మేల్కొని క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేస్తారా? లేక "అధికారులు ఉన్నారా.. లేరా?" అనే ప్రశ్నలు ఇలాగే కొనసాగు

# మరిపెడ ఎస్సీ కాలనీ యువకుడికి డాక్టరేట్

- **పేదరికం, ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత శిఖరాలకు.**
- **ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించిన బాషిపంగు వెంకన్న**
- **'ఎక్కడ పుట్టామన్నది కాదు.. ఎక్కడికి ఎదిగామన్నదే ముఖ్యం'**
- **మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్**
- **గుడిపూడి నవీన్‌రావు**
- **ఘనంగా సన్మానం.. అభినందించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సాహిత్య అభిమానులు**

**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 9 (దేశ టైమ్స్)**

సామాన్య కుటుంబంలో జన్మించి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, ప్రతికూల పరిస్థితులు, అవరోధాలను ఎదుర్కొంటూనే విద్యపై ఉన్న మక్కువను వదులుకోకుండా పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించిన మరిపెడ గ్రామానికి చెందిన బాషిపంగు వెంకన్న అరుదైన ఘనతను సాధించారు. ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి "తెలంగాణ కథా సాహిత్యం--ప్రాదేశిక వ్యక్తీకరణ" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఓ యువకుడు నిరంతర అధ్యయనం, కృషి, పట్టుదలతో విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం పట్ల మరిపెడ ప్రాంతంలో హర్షం వ్యక్తమవుతోంది.

**సామాన్య కుటుంబం నుంచి పరిశోధన పీఠం వరకు..**

మరిపెడ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బాషిపంగు గురవయ్య (లేటు), సుగుణమ్మ దంపతుల తృతీయ సంతానమే బాషిపంగు వెంకన్న. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంచుకున్న వెంకన్న తన జీవితంలో ఎదురైన అనేక ఇబ్బందులను అధిగమిస్తూ చదువును కొనసాగించారు. కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా నిరుత్సాహపడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. విద్యార్థి దశ నుంచే తెలుగు భాష, సాహిత్యంపై ప్రత్యేక ఆసక్తిని పెంచుకున్న ఆయన తదుపరి పరిశోధన వైపు అడుగులు వేశారు. తెలంగాణ ప్రాంతీయ జీవన విధానం, ప్రజల ఆలోచనలు, సామాజిక పరిస్థితులు, స్థానిక సంస్కృతి, మాండలిక భాష తదితర అంశాలు కథా సాహిత్యంలో ఎలా ప్రతిబింబిస్తున్నాయనే అంశాలపై ఆసక్తితో పరిశోధన చేపట్టారు. ఈ క్రమంలో "తెలంగాణ కథా సాహిత్యం--ప్రాదేశిక వ్యక్తీకరణ" అంశాన్ని ఎంచుకుని విస్తృతంగా అధ్యయనం చేసి పరిశోధన పూర్తి చేశారు.

**ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ**

తెలుగు సాహిత్య రంగంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి వెంకన్న పీహెచ్‌డీ పట్టా పొందారు. ఎన్నో ఏళ్లపాటు కొనసాగించిన అధ్యయనం, పరిశోధనకు గుర్తింపుగా డాక్టరేట్ లభించడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరిపెడ ఎస్సీ కాలనీ నుంచి ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం పట్ల స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

**ఉపాధ్యాయుడిగా సేవలు**

ప్రస్తుతం వెంకన్న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకున్‌గూడెం గ్రామంలో ఉన్న ఎంజేపీ కూసుమంచి బాయ్స్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే సాహిత్యంపై తనకున్న ఆసక్తిని కొనసాగిస్తూ పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందించేలా ఆయన కృషి చేస్తున్నారని సహచరులు, మిత్రులు పేర్కొంటున్నారు.

**గుడిపూడి నవీన్‌రావు అభినందనలు**

వెంకన్న డాక్టరేట్ సాధించిన విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఆయనను ప్రత్యేకంగా



అభినందించారు. వెంకన్నను ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నవీన్‌రావు మాట్లాడుతూ.. "ఎక్కడ పుట్టామన్నది కాదు.. ఎక్కడికి ఎదిగామన్నదే ముఖ్యం" అని అన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన వెంకన్న ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. విద్యను ఆయుధంగా చేసుకుని పట్టుదలతో ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించవచ్చని వెంకన్న నిరూపించారని పేర్కొన్నారు.

**యువతకు ఆదర్శం**

నేటి యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో బాషిపంగు వెంకన్న ప్రస్థానం వారికి ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ నేపథ్యం, ఎదురయ్యే అవరోధాలు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని, కష్టపడే తత్వం, నిరంతర అధ్యయనం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన నిరూపించారని అన్నారు. "కష్టాలను విజయానికి మెట్లుగా మార్చుకుని సామాన్య కుటుంబం నుంచి పరిశోధన పీఠం వరకు ఎదిగిన బాషిపంగు వెంకన్న ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం వ్యక్తిగత విజయమే కాకుండా మరిపెడ ప్రాంతానికి, సమాజానికి గర్వకారణం" అని పలువురు అభిప్రాయపడ్డారు.



**అభినందనల వెల్లువ**

వెంకన్న డాక్టరేట్ సాధించిన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సాహిత్య అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ సాహిత్య రంగంలో మరిన్ని పరిశోధనలు చేసి తెలుగు భాష, తెలంగాణ సాహిత్యానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వెంకన్న తన పట్టుదలతో సాధించిన ఈ విజయం మరిపెడ యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## కార్మిక కర్షక హక్కులను కాలరాస్తున్న పాలకులు



**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 9 (దేశ టైమ్స్)**

మహబూ బాబాద్ జిల్లా మరిపెడ అబ్బాయి పాలెం గ్రామం లో జీపూ జాత ప్రారంభం సందర్భంగా, గుండ గాని మధుసూదన్ అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల వీరయ్య మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎందరో పోరాట యోధులు త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని, కార్మిక కర్షక హక్కులను, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య అన్నారు, లేబర్ కోళ్ల అమలుకు రూల్స్ నోటిఫై చేసింది, బడా పెట్టుబడి దారుల లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసింది, రోజువారి పని విధానాన్ని 8:00 గంటల నుండి 12:00 గంటల వరకు పెంచేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించారు, సమ్మె అక్కును కాలరాస్తూ ఆంక్షలు విధించారు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడారు, అనేక కంపెనీలలో కార్మికులను తొలగించేందుకు, ఐర్ మరియు ఫైర్ విధానాన్ని తీసుకువచ్చారు, విద్యుత్ ఉత్పత్తి రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల జాబితాలో ఉన్నది కానీ దీన్ని కేంద్ర ప్రభుత్వం 2025 విద్యుత్ సవర్ణ బిల్లును ఆమోదించుకున్నారు, ఈ చట్ట ప్రకారం, విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణీ, బాధ్యతలను కేంద్రమే ఆధీనంలోకి తీసుకున్నారు, దీనివల్ల విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయి, ఇక భవిష్యత్తులో ఉచిత విద్యుత్తు జీరో బిల్లులు అనేవి ఉండవు, ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున, కార్మికులు పేదలు రైతులు ఉద్యోగులు గ్రామీణ సేవకులు కదిలి వచ్చి జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్గనైజర్ బాణాలు రాజన్న సిఐటియు నాయకులు గుండ గాని మధుసూదన్, నందిపాటి వెంకన్న, కొండ ఉప్పలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జిన్న లచ్చన్న, రైతు సంఘం నాయకులు తాటికొండ అనంత చారి, నలబోలు లక్ష్మారెడ్డి, ఎస్కే షరీఫ్, సురేష్, పోలేపాక ప్రవళిక, పగిళ్ల సత్యం తదితరులు పాల్గొన్నారు

# బోనాల పండుగ వేడుకలు...

- **బోనం ఎత్తుకున్న చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



కోరుట్ల పట్టణ బాలాజీ రోడ్లో గల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ వేడుకలను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లు విచ్చేసి బోనం ఎత్తుకొని పట్టణ పురవీధుల గుండా తప్పు తప్పులు పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ ఆ అమ్మవారి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కృషి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ నాయకులు కడకుంట్ల గంగాధర్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మరిపెడలో ఘోర రోడ్డు ప్రమాదం.

**బైక్ ను ఢీకొట్టిన లారీ,ఒకరు మృతి.**





**మహబూబాబాద్/మరిపెడ,ఆగస్టు 09(దేశ టైమ్స్)**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు.మృతుడు దుబ్బ తండాకు చెందిన భానోత్ వెంకట్రాం వయసు 45 సంవత్సరాలు.వ్యవసాయ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.ఆదివారం పని నిమిత్తం మరిపెడ బంగ్లాకు బైక్ పై వచ్చిన వెంకట్రాం పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు.మరిపెడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపానికి చేరుకోగానే వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ అతను నడుపుతున్న బైక్ ను బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వెంకట్రాం రోడ్డుపై పడిపోయాడు.కింద పడిన వెంటనే లారీ చక్రం అతని తలపై నుండి వెళ్లడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

డ్రైవర్ అరెస్టు:

ప్రమాదం చేసిన వెంటనే లారీని ఆపకుండా డ్రైవర్ పారిపోయాడు.విషయం తెలుసుకున్న స్థానికులు,పోలీసులకు సమాచారం ఇచ్చారు.వెంటనే రంగంలోకి దిగిన మరిపెడ ఎస్సై సత్తిష్ బృందం లారీని వెంబడించి,ఎల్లంపేట స్టేజి సమీపంలో లారీని అడ్డగించి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ఇరుకు కారణంగానే ప్రమాదాలు-ప్రజల ఆగ్రహం:

ఈ ప్రమాదంతో తండలో తీవ్ర విషాదం నెలకొన్నది.వెంకట్రాం కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఘటనా స్థలాన్ని పరిశీలించిన వాహనదారులు,స్థానికులు రోడ్డు ఇరుకుగా ఉండడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మధ్యలో సెంటర్ డివైడర్ ఉండడం వల్ల రోడ్డు మరింత ఇరుకుగా మారిందని,దీంతో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని వాపోయారు.ఇదివరకు కూడా ఇదే ప్రాంతంలో చాలా ప్రమాదాలు జరిగాయని,ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని,అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు,సంబంధిత అధికారులను కోరుతున్నది ఒక్కటే వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఇలాంటి ప్రమాదాలను నివారించాలని.రద్దీ ఎక్కువగా ఉండే ఈ రహదారిపై,రోజుకు వందల్లో లారీలు,ద్వి చక్ర వాహనాలు తిరుగుతుంటాయని,సంబందిత అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు...

## తల్లిపాలు... శిశువు తొలి హక్కు -- ఆరోగ్యకర తెలంగాణకు బలమైన పునాది...

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘన ముగింపు... ఏడాది పొడవునా అవగాహన కొనసాగించాలని ప్రజల ఆకాంక్షపుట్టిన శిశువుకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన తొలి అమృతం. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని అందించే అత్యుత్తమ ఆహారం తల్లిపాలే. ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత ఏడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై విశేష చైతన్యాన్ని కల్పించింది.

శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు...

వైద్య నిపుణుల సూచనల ప్రకారం శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరం. తొలి పాలు (కొలస్ట్రం)లో ఉండే యాంటీబాడీలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందిస్తాయి. మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

తల్లిపాల ప్రయోజనాలు ఎన్నో...

తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడమే కాకుండా విరేచనాలు, న్యుమోనియా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు తోడ్పడతాయి. తల్లులకు కూడా ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ ప్రమాదం తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

వైద్యుల సలహాలు...

తల్లిపాలు శిశువుకు అత్యంత సురక్షితమైన, పరిశుభ్రమైన, సంపూర్ణ ఆహారమని వైద్యులు పేర్కొంటున్నారు. తల్లులు సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా తల్లిపాల ఉత్పత్తి మెరుగుపడుతుందని సూచిస్తున్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణకు తల్లిపాలే పునాది...

ఆరోగ్యవంతమైన భావితరాలను తీర్చిదిద్దడంలో తల్లిపాల పాత్ర అమోఘం. ప్రభుత్వ చర్యలు, వైద్యుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల సహకారం, సమాజ భాగస్వామ్యం కలిసివస్తే ప్రతి శిశువుకు తల్లిపాల హక్కు సాకారం అవుతుంది. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగిసినా, “తల్లిపాలపై అవగాహన ప్రతి రోజూ కొనసాగాలి” అనే సందేశమే ఈ ఏడాది కార్యక్రమాల ప్రధాన ఫలితంగా నిలిచింది. తల్లిపాలు కేవలం శిశువు ఆహారం మాత్రమే కాదు... ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరం.సీనియర్ పాత్రికేయురాలు సయ్యదా ఆలియా ఇస్మత్

సెల్: 8639754985

# కాంపల్లిలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ

- **సామాజిక న్యాయం, సమానత్వం కోసం మహనీయుల సేవలు చిరస్మరణీయం**
- **వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి**
- **ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్**



**మహబూబాబాద్/ సీరోల్, ఆగస్టు 09:(దేశ టైమ్స్)**

మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం కాంపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను తెలంగాణ ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయులకు నివాళులర్పించారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మహనీయుల సామాజిక సేవలు, వారు చూపిన మార్గం, సమాజ నిర్మాణంలో వారి పాత్రను పలువురు గుర్తు చేసుకున్నారు.

**అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలేలు సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు జీవితాలను అంకితం చేశారని అన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వారు చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాన్ని కల్పించే బలమైన పునాదులు వేశారని అన్నారు. విద్య, సామాజిక చైతన్యం, హక్కుల సాధన ద్వారా అణగారిన వర్గాలు అభివృద్ధి చెందాలని ఆయన చూపిన మార్గం నేటికీ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు.బాబు జగ్జీవన్‌రామ్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ సామాజిక సమానత్వం, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేశారని గుర్తుచేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే విద్య, మహిళా సాధికారత, కుల వివక్ష నిర్మూలన కోసం చేసిన పోరాటం సమాజానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

**మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి**

మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా వారి ఆశయాలను నేటి తరాలు ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.యువత మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి వారి ఆలోచనా విధానాన్ని, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరూ ఐక్యంగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

**ఘనంగా కార్యక్రమం**

కాంపల్లి గ్రామంలో ఒకే వేదికపై ముగ్గురు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి ఆవిష్కరించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



# నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ...





కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్లతో కలిసి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ నూతన ఆసరా సామాజిక భద్రత పెన్షన్ దరఖాస్తు చేసుకొనుటకు ఆధార్ కార్డు తెల్ల రేషన్ కార్డు వయస్సు ధ్రువీకరణ పత్రము బ్యాంకు పాస్పోర్ట్ జిరాక్స్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో వర్గాన్ని బట్టి కులా లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి వితంతు పెన్షన్ అయితే భర్త ధ్రువీకరణ పత్రం దివ్యాంగుల పెన్షన్ అయితే సదరం సర్టిఫికెట్ గీత చేనేత కార్మికులు అయితే సంబంధిత సొసైటీ సభ్యత్వ ధ్రువీకరణ పత్రం తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా తప్పకుండా పెన్షన్ వచ్చేలా కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ షాహిద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం నాయకులు ఎడ్ల రమేష్ వాసిద్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు పెన్షన్ దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280